క్లుప్తంగా

ఈకేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలి



వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మునగపాక: ఈకేవైసీ ప్రక్రియని వేగవంతం చేయాలని కోరుతూ సోమవారం వ్యవసాయ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత బ్రహ్మాజీ మాట్లాడుతూ ఒకవైపు అన్నదాత సుఖీభవం పథకానికి సంబంధించి ఈకేవైసీకి గడువు ముంచుకొస్తుంటే.. అధికారులు అందుబాటులో లేకపోవడం విచారకరమన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. మరో వైపు తరచూ సర్వర్లు పనిచేయకపోవడంతో ఈకేవైసీ నమోదులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆడారి రమణ, కాండ్రేగుల నాయుడు, దాడి సూరిబాబు, బుద్ద రమణ, పెంటకోట చిననాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



సైకిల్ స్టాండ్ ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు, ఎస్ఎంసీ చైర్మన్ సూర్యచంద్రరావు

మునగపాక: విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సైకిల్ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఎస్ఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతలు కూడా సహకారం అందించాలన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతానికి సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మునగపాక మండలం నుంచి విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఎంఈవోలు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మునగపాక మండలం నుంచి 1000 మంది విద్యార్థులను విశాఖకు తీసుకువెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, పలు పాఠశాలల హెచ్ఎంలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీ కోరారు. మండలంలోని గంగాదేవిపేటలో సోమవారం ఆమె విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మొల్లేటి చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

నర్సీపట్నం : అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రతినిధులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగమే అయినా గౌరవ వేతనం ఇస్తున్నారని, గౌరవ వేతనం పేరుతో సంక్షేమ పథకాల్లో కోత విధించడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీలు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సంక్షేమ పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో కనీస వేతనం ఇవ్వాలన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



వాడ్రాపల్లిలో వరిసాగుకు సిద్ధం చేసిన దుక్కు

- అనుకూలంగా వాతావరణం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల సరఫరా
- దుక్కులకు సిద్ధమవుతున్న అన్నదాతలు

మునగపాక: కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు అనుకూలంగా ఉన్న పంటల సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. అధికారులు కూడా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల పంపిణీకి చర్యలు చేపట్టారు.

ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 3,897 హెక్టార్లు

మునగపాక మండల వ్యాప్తంగా ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 3,897 హెక్టార్లు. వాటిలో వరి 1,456 హెక్టార్లు కాగా.. చెరకు 1,053 హెక్టార్లు.. ఇతర పంటల సాగు 1,153 హెక్టార్లుగా ఉంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంటల సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గతంలో చెరకు సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. తెగుళ్ల బెడద కారణంగా చెరకు సాగు తగ్గుతూ వస్తోంది. ప్రత్యామ్నాయంగా వరితో పాటు ఇతర పంటల సాగుపై రైతులు దృష్టి సారించారు.

రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు

మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. 610 క్వింటాళ్ల మేర పలు రకాల వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. కొన్ని చోట్ల విత్తన పంపిణీ ప్రారంభమైంది. ప్రస్తుతానికి 440 మెట్రిక్ టన్నుల యూరియాను రైతుల కోసం అందుబాటులో ఉంచారు. యూరియా ఆవశ్యకతను గుర్తించి అదనంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి స్థానిక అధికారులు ఇండెంట్ పెట్టారు.

ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు

మోతాదుకు మించి ఎరువులను వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అధికారులు సలహాలు, సూచనలు చేస్తున్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన ఎరువులను వినియోగించాలంటూ అవగాహన కల్పిస్తున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

భూమిని గుల్లపరిచి పంటల సాగులో మెరుగైన దిగుబడులు సాధించేందుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచారు. పచ్చిరొట్ట విత్తనాలను ఎరువుగా వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. భూమి గుల్లబారేందుకు పచ్చిరొట్ట విత్తనాలు ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ విత్తనాలు చల్లేందుకు రైతులు దుక్కులు చేస్తున్నారు. కొన్ని చోట్ల వరి సాగుకు సంబంధించి దుక్కులు చేయగా మరికొన్ని చోట్ల పచ్చిరొట్ట విత్తనాలు వేసేందుకు రైతులు చర్యలు తీసుకుంటున్నారు. 10 కిలోల జనుములు బస్తా రూ.545, 10 కిలోల జీలుగ రూ.615, 8 కిలోల పిల్లిపెసర రూ.720కు అందజేస్తున్నారు.

మెరుగైన దిగుబడులకు అవకాశం



ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చాం. పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై సరఫరా చేస్తున్నాం. అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులకు అవకాశం ఉంటుంది. ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

– సిహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి



విత్తనాలు అందుకుంటున్న రైతులు (ఫైల్)



పచ్చిరొట్ట విత్తనాల సాగుకు సిద్ధం చేసిన భూమి

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఆలయ నిర్మాణానికి అనకాపల్లికి చెందిన బుద్ద వినీల్‌కుమార్ రూ.30 వేలు విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, బొడ్డేడ రామునాయుడు, వెలగా శ్రీనివాసరావు, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి శ్రీకాంత్, ఆడారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

అచ్యుతాపురం రూరల్ : తాగునీటి ఎద్దడిపై మడుతూరు గ్రామంలో మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఎస్సీ కాలనీకి తాగునీరు అందడం లేదంటూ సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. చాలా కాలంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో దూర ప్రాంతాల నుంచి రోజూ బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని సోమునాయుడు హెచ్చరించారు.

‘కూటమి’ మోసాలు అందరికీ తెలియాలి



‘జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన విధ్వంసాలు, మోసాలపై వైఎస్సార్‌సీపీ పుస్తకాన్ని రూపొందించిందని ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. అడ్డురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ‘జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, మోసాలు ప్రతి ఒక్కరికి తెలిసే కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. చంద్రబాబు పూర్తి స్థాయిలో ఒక్క పథకం కూడా అమలు చేయకుండా సూపర్‌సిక్స్ పథకాలు అందరికీ అందినట్టు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో నిత్యం రెడ్‌బుక్ అరాచకాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి, జెడ్పీటీసీలు కాకర దేవి, లంక సూరిబాబు, వైఎస్సార్ సీపీ అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మదువర్మ, జిల్లా కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, ఎస్.రాయవరం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, పాయకరావుపేట పట్టణ అధ్యక్షుడు దనిశెట్టి మహేష్, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బొండా దివాణం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి



ఎంపీడీవో రమేష్‌నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న టిడ్కో కాలనీ మహిళలు

పరవాడ: అర్హులైన నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం టిడ్కో గృహ సముదాయం లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త పింఛన్ల మంజూరు కోసం ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నారన్నారు. టిడ్కో కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారని, చీకటి పడితే విష జంతువుల మధ్య సావాసం చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీకి చెత్త బండి రాకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. కాలనీలో ప్రతి వీధిలో సీసీ కెమెరాలను అమర్చి, రేషన్ డిపో ద్వారా 14 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో రమేష్‌నాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు బంగారమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ, సంతోషి, సీతామహాలక్ష్మి, అబద్దం సీతమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపఖజానా కార్యాలయంలో నిలిచిన సేవలు

- పిడుగు పడి ఐదు రోజులుగా పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు
- వివిధ పనుల కోసం కక్షిదారుల ప్రదక్షిణలు



ఉపఖజానా కార్యాలయంలో పనిచేయని కంప్యూటర్లు,ప్రింటర్లు



యలమంచిలి ఉపఖజానా కార్యాలయం

యలమంచిలి రూరల్: యలమంచిలి ఉప ఖజానా కార్యాలయంలో ఐదు రోజులుగా కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. దీంతో ఈ కార్యాలయం ద్వారా ప్రాసెస్ కావాల్సిన బిల్లులకు చిక్కులు తప్పడం లేదు. ఈ నెల 9న యలమంచిలి పట్టణంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో స్థానిక ఉపఖజానా కార్యాలయం సమీపంలో పిడుగులు పడ్డాయి. దీంతో కార్యాలయంలో మొత్తం కంప్యూటర్లు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ డివైస్‌లు, కొన్ని విద్యుత్ వైర్లు కాలిపోయాయి. అప్పటి నుంచి ఇక్కడ సేవలన్నీ స్తంభించిపోయాయి. యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు సంబంధించిన 2 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 1200 మంది పెన్షనర్లు, మరికొన్ని శాఖల అధికారుల జీతభత్యాలు, వసతి గృహాలు, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ సహా ప్రభుత్వ నిధుల వ్యయానికి సంబంధించిన సుమారు 1000కి పైగా బిల్లులన్నీ ఇక్కడ ఉపఖజానా కార్యాలయం ద్వారానే ఆమోదం పొందాల్సి ఉండగా.. 50కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. సేవలు స్తంభించిపోవడంతో వివిధ పనులపై వస్తున్న పెన్షనర్లు, ఇతర ఉద్యోగులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉపఖజానాధికారి, మరో ఉద్యోగి తమ సొంత ల్యాప్‌టాప్‌లు తెచ్చి పలు అత్యవసర పనులు పూర్తి చేస్తున్నారు. మిగతా సిబ్బందికి పనిలేకపోవడంతో ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా కార్యాలయంలో సేవలు యథాతథంగా అందించేలా చర్యలు తీసుకోవాల్సిన ఖజానాశాఖాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై యలమంచిలి ఉప ఖజానాధికారి టి.ఉదయ భాస్కరరావును సంప్రదించగా.. పిడుగు పడడంతో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర వస్తువులు పాడైన మాట వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. కక్షిదారులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.

కూటమి ఏడాది పాలన.. అంతా నయవంచన

- మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు
- ‘జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం’ పుస్తకావిష్కరణ



యలమంచిలిలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు



కోటవురట్లలో పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలను ఎంతగా మోసం చేయవచ్చో సీఎం చంద్రబాబు మరోసారి చేసి చూపించారని వైఎస్సార్‌సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు విమర్శించారు. కోటవురట్లలో ‘జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం’అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేయకుండానే హామీలన్నీ నెరవేర్చేశామని సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏడాది పాలనలో డైవర్షన్ పాలిటిక్స్, కుట్రలు, కుతంత్రాలు, రాజకీయ కక్షలే కనిపించాయని ఆరోపించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు సొంతంగా ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షే పథకాలనే కాపీ కొడుతూ మధ్యమధ్యలో ప్రజలపై దొంగ ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు మోసాలు ప్రజలకు స్పష్టంగా తెలిశాయని, రానున్న రోజుల్లో బుద్ధి చెప్పక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.సత్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ నాయకుడు కన్నబాబు పాల్గొన్నారు.

‘హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాటాలు ఆగవు’

యలమంచిలి రూరల్: అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు ప్రజలను నిలువునా మోసం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని, గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేలా నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని యలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం యలమంచిలిలోని పార్టీ కార్యాలయంలో నాయకులంతా ‘జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం’పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ యలమంచిలి పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర మాట్లాడుతూ ‘జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం’అన్న విషయం రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే అర్థమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న ప్రతిపక్ష నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. రాష్ట్రంలో 1 నుంచి 12 తరగతులు చదువుతున్న పిల్లలందరికీ ఏడాదికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని నమ్మబలికి ఏడాది తర్వాత పథకాన్ని అరకొరగా అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని నాయకులు విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికిపైగా పిల్లలకు తల్లికి వందనం ఎగ్గొట్టారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల పార్టీ అధ్యక్షులు పిన్నమరాజు కిషోర్‌రాజు, దేశంశెట్టి శంకరరావు, ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు, పార్టీ సీనియర్లు గొట్టుముక్కల శ్రీనుబాబు, కోన బుజ్జి, సేనాపతి రాము, దాసరి కుమార్, దూది నర్సింహమూర్తి, పిల్లా త్రినాథరావు, పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, కోడిగుడ్డు రమణ, దుంగా అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి కార్మికులను తరలిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

అచ్యుతాపురం రూరల్ : పరిమితికి మించి కార్మికులను తరలిస్తున్న వాహనాలపై అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ కేసులు నమోదు చేశారు. ‘కార్మికుల తరలింపులో నిర్లక్ష్యం’అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సోమవారం పోలీసులు స్పందించారు. రోడ్డు ప్రమాదాల నివారణ దృష్ట్యా పరిమితికి మించి రాకపోకలు జరిపే వాహనాలపై కేసులు నమోదు చేశారు. వలస కార్మికుల స్థావరాల నుంచి పరిశ్రమలకు తీసుకెళ్లే కాంట్రాక్టర్లు.. కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దేవరాపల్లిలో లైసెన్స్ వరి విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: లైసెన్స్ దుకాణాలలో ఖరీఫ్ వరి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ హెచ్చరించారు. మండల కేంద్రంలోని హేమ రైతు డిపో, మన గ్రోమోర్ లైసెన్స్ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను సోమవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను తనిఖీ చేశారు. దుకాణాల ఎదుట రైతులకు తెలిసే విధంగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే ప్రతీ రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు బస్తా మొత్తం తెరవకుండా రంధ్రం చేసి 100 గింజలను తీసి మొలక శాతం కట్టాలని సూచించారు.

ఖరీఫ్ వరి విత్తనాలు పంపిణీ నేడు...

ఖరీఫ్ వరి విత్తనాలను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ చేతులు మీదుగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి కాంతమ్మ తెలిపారు.

అనకాపల్లిలో ఆధార్ కష్టాలు



రోజుకు 30 మందికి మాత్రమే సేవలు ఉంటాయని తెలియజేస్తున్న బోర్డు

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరైంది. ఆధార్ కార్డుల్లో పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్ మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్, నూతన కార్డుల కోసం ప్రజలు నిరంతరం ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్ యూనియన్ బ్యాంక్, చోడవరం బస్టాప్ ఎదురుగా ఉన్న ఇండియన్ బ్యాంక్, ఉడ్‌పేట యూనియన్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ ప్రధాన కేంద్రం, గవరపాలెం పోస్ట్ ఆఫీస్‌లలో ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు గంటలు కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి మిగిలిన వారికి రిక్తహస్తం చూపిస్తున్నారు. కొన్నిసార్లు సర్వర్ డౌన్ అని చెప్పడంతో రోజంతా ఉండాల్సి వస్తుంది. సేవలకు ప్రభుత్వం సూచించిన దానికంటే ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్క బయోమెట్రిక్ సేవ కోసమే రూ.100, మిగిలిన ఏ సేవ అయినా రూ.50 వసూలు చేయాల్సి ఉండగా, ఆయా వ్యక్తుల బట్టి అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.